sahanamvande.com

epaper.sahanamvande.com

సహనం వందే

హైదరాబాద్ | 22-08-2026 శుక్రవారం | సంపుటి-02 సంచిక : 134 EDITOR: ROHINI



వందేమాతరం @1937

90 ఏళ్ల క్రితం అసలు ఏం జరిగింది?

- జిన్నాకు గాంధీ తలొగ్గాడా?
- చరణాల వెనుక తూటాలు
- పాత చరిత్ర కొత్త చిచ్చు
- చట్టంతో మారిన సమీకరణాలు
- వందేమాతరానికి పాత గాయాలు

వందేమాతరం అనగానే మనలో చాలామందికి దేశభక్తి ఉప్పొంగుతుంది. కానీ అదే వందేమాతరం విషయంలో 89 ఏళ్ల క్రితం తీసుకున్న ఒక చిన్న నిర్ణయం... నేడు దేశంలో పెద్ద యుద్ధానికే దారి తీస్తుందని ఎవరైనా ఊహించారా? ఒక పాటలో అన్ని చరణాలు పాడాలా లేక రెండు చరణాలు మాత్రమే పాడాలా? అని తగువులాడుకోవడం వెనుక ఉన్న అసలు ఉద్దేశం ఏంటి?

- సహనం వందే, హైదరాబాద్:

1875లో బంకించంద్ర చటో పాధ్యాయ రచించిన వందేమాతరం గీతం తొలినాళ్లలో దేశ స్వాతంత్ర్య ఉద్యమానికి ఊపిరిపోసింది. 1905నాటి వందేమాతరం ఉద్యమం సమయంలో ఇది దేశమంతటా మార్మోగింది. అయితే పాటలోని మూడో చరణం నుండి మాతృభూమిని హిందూ దేవతలతో పోల్చడంపై భిన్నమైన అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. మతపరమైన విశ్వాసాల దృష్ట్యా ఇస్లామిక్ సూత్రాలకు ఇది భిన్నంగా ఉందని అప్పటి ముస్లిం నాయకులు భావించారు.

1937 నాటి చారిత్రక రాజీ...

1937అక్టోబరులో ముహమ్మద్అలీ జిన్నా ఈ గీతంపై తీవ్ర విమర్శలు చేయడంతో రాజకీయ వేడి పెరిగింది. అప్పట్లో కాంగ్రెస్ నాయకులు గాంధీజీ, నెహ్రూ, సుభాష్ చంద్రబోస్, రవీంద్రనాథ్ ఠాగూర్ చర్చించి ఒక నిర్ణయానికి వచ్చారు. ఠాగూర్ సూచనతో...తొలి రెండు చరణాలు దేశ సౌందర్యాన్ని వర్ణిస్తాయని భావించి జాతీయ వేదికలపై కేవలం వాటినే పాడాలని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తీర్మానించింది. 1950వరకు ఈ పద్ధతే కొనసాగింది.

నేటి కొత్త చట్టం వెనుక ఉన్న మర్మం...

ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జాతీయ గౌరవ పరిరక్షణ సవరణ చట్టం ద్వారా వందేమాతరానికి జాతీయ గీతంతో సమాన రక్షణ లభించింది. ఈ చట్టం ఎవరినీ పాడమని బలవంతం చేయదు... కానీ పాటను ఎవరైనా అడ్డు కుంటే 3 ఏళ్ల జైలు శిక్ష పడుతుంది. అయితే చట్టంలో ఎన్ని చరణాలు పాడాలనే స్పష్టత లేకపోవడంతో... హోంశాఖ ద్వారా ప్రత్యేక ప్రోటోకాల్ జారీ చేసి 6 చరణాలు పాడాలని ఆదేశించారు.

నెహ్రూ లేఖపై రాజకీయ దాడి...

పార్లమెంటు వేదికగా ప్రధాని నరేంద్ర మోదీ...1937లో జిన్నా ఒత్తిడికి తలొగ్గి కాంగ్రెస్ పాటను కత్తిరించిందని ఆరోపించారు. అందుకు నెహ్రూ రాసిన ఒక లేఖను సాక్ష్యంగా చూపుతూ... కాంగ్రెస్ నిర్ణయం అప్పుడే దేశ ఐక్యతకు భంగం కలిగించిందని విమర్శించారు. ఈ లేఖ ద్వారా కాంగ్రెస్ మతపరమైన బుజ్జగింపులకు నాడే పునాది వేసిందని బీజేపీ నేతలు వాదిస్తున్నారు.

ప్రియాంక గాంధీ కౌంటర్...

బీజేపీ ఆరోపణలను తిప్పికొడుతూ కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ వాద్రా పార్లమెంటులో నెహ్రూ రాసిన లేఖను పూర్తి స్థాయిలో చదివారు. మతతత్వవాదుల ఒత్తిడికి తలొగ్గకుండా, ప్రజల మనోభావాలను గౌరవిస్తూనే సమస్యను పరిష్కరించాలని నెహ్రూ ఆ లేఖలో ఆకాంక్షించారని ఆమె వివరించారు. కాంగ్రెస్ వైఖరి మత సామరస్యం కోసమే తప్ప విభజన కోసం కాదని ఆమె స్పష్టం చేశారు.

రాజకీయ విభిన్న వాదనలు

వందేమాతరం గౌరవం చట్టం ద్వారా పెరిగిందని ప్రభుత్వం అంటుంటే, స్వాతంత్ర్య సమరయోధుల రాజీని కాపాడటమే నిజమైన దేశభక్తి అని విపక్షాలు వాదిస్తున్నాయి. ఒకే పాటపై 89 ఏళ్ల క్రితం మొదలైన ఈ వివాదం 2026లో కూడా కొనసాగుతూంది. రాజకీయ ప్రయోజనాల కోసం చరిత్రను ఎలా వాడుకుంటున్నారో ఎత్తి చూపుతోంది. మతం, దేశభక్తి, రాజకీయం కలిసిన ఈ గీతం ఇప్పుడు దేశంలో ఒక తీవ్రమైన చర్చకు వేదికగా మారింది.

పెళ్లి కాకుండానే కలిసుండొచ్చు

సహజీవనం పెళ్లితో సమానం

- ఢిల్లీ హైకోర్టు సంచలనాత్మక తీర్పు
- కుటుంబ సభ్యుల జోక్యం నిషిద్ధం
- పోలీసు భద్రత కల్పించాలని ఆదేశం
- లివిన్-ఇన్ రిలేషన్‌షిప్‌కు చట్టపరమైన రక్షణ



నగరాల్లో లివిన్-ఇన్ రిలేషన్‌షిప్‌లు సర్వసాధారణమైపోతున్నాయి. పెళ్లికి ముందే ఒకరినొకరు పూర్తిగా అర్థం చేసుకోవడానికి చాలామంది జంటలు సహజీవనం మార్గాన్ని ఎంచుకుంటున్నాయి. అయితే ఇలాంటి బంధాలను మన సమాజం, సంప్రదాయవాద కుటుంబాలు అంగీకరించలేకపోతున్నాయి. కొందరైతే దీనిని తమ పరువు ప్రతిష్టలకు భంగకరంగా భావించి తీవ్రమైన వ్యతిరేకతను ప్రదర్శిస్తున్నారు. సరిగ్గా ఇలాంటి ఒక అంశంపై తాజాగా ఢిల్లీ హైకోర్టులో కీలకమైన విచారణ జరిగింది. ఇద్దరు మేజర్లు అయిన ఒక జంట తమకు ప్రాణభయం ఉందంటూ కోర్టును ఆశ్రయించడంతో ఈ వివాదం వెలుగులోకి వచ్చింది. **- సహనం వందే, న్యూఢిల్లీ**

చట్టపరంగా ఆ జంట ఇంకా వివాహం చేసుకోనప్పటికీ...వారిది లివిన్-ఇన్ రిలేషన్‌షిప్ అయినప్పటికీ అది పెళ్లితో సమానమేనని కోర్టు వ్యాఖ్య చేసింది. ఇద్దరు వ్యక్తులు పరిణతితో,స్వచ్ఛందంగా, పూర్తి బాధ్యతతో ఒకరితో ఒకరు కలిసి జీవించాలని నిర్ణయించుకున్నప్పుడు ఎవరికీ ఆ హక్కును ప్రశ్నించే అధికారం లేదు. అది తల్లిదండ్రులు కావచ్చు, బంధువులు కావచ్చు లేదా స్నేహితులు కావచ్చు.. ఎవరైనా సరే వారి జీవితాలకు లేదా స్వేచ్ఛకు ఆటంకం కలిగించడం చట్టరీత్యా నేరమని కోర్టు హెచ్చరించింది. ఈ తరహా సంబంధాలకు భారతీయ చట్టాలలో కూడా తగినంత పవిత్రత, గుర్తింపు ఉందని న్యాయస్థానం స్పష్టం చేసింది.

ఆశ్రయించిన జంటకు కోర్టు భద్రత

30 ఏళ్ల వయసున్న ఆ జంట కొంతకాలంగా సహజీవనం చేస్తూ భవిష్యత్తులో వివాహం చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. కానీ అమ్మాయి తరఫు కుటుంబ సభ్యుల నుంచి వారికి తీవ్రమైన బెదిరింపులు ఎదురయ్యాయి. ఆమె తండ్రి, సోదరుడు ఈ బంధాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తూ వారి ప్రాణాలకు ముప్పు తెచ్చేలా ప్రవర్తించారు. స్థానిక పోలీసులను ఆశ్రయించినా ఎలాంటి స్పందన రాకపోవడంతో చేసేది లేక ఆ జంట నేరుగా ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. తమకు రక్షణ కల్పించాలని కోరుతూ జాయింట్ పిటిషన్ దాఖలు చేశారు. జస్టిస్ సౌరభ్ బెనర్జీ ఈ పిటిషన్‌ను విచారించి, ఆ జంటకు తక్షణ పోలీసు రక్షణ కల్పించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు

ఈ కేసు విచారణ సందర్భంగా ఢిల్లీ హైకోర్టు చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు దేశవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. కులం, మతం, ప్రాంతం వంటి ఏ బేధాలు లేకుండా వ్యక్తులు తమ జీవిత భాగస్వామిని ఎన్నుకునే ప్రాథమిక హక్కు కలిగి ఉంటారని కోర్టు గుర్తుచేసింది. కేవలం సంప్రదాయాల పేరుతో మేజర్ల ప్రాథమిక హక్కులను అడ్డుకోవడం వారి వ్యక్తిగత స్వేచ్ఛను హరించడమే అవుతుందని హైకోర్టు స్పష్టం చేసింది. చట్ట ప్రకారం పెద్దలైనా సరే యువత వ్యక్తిగత నిర్ణయాలలో జోక్యం చేసుకునే హక్కు లేదని తేల్చిచెప్పింది.

గృహహింస చట్టం కింద రక్షణ మార్గాలు

ఎలాంటి చట్టబద్ధమైన వివాహ బంధం లేకపోయినా, మేజర్లు తమకు నచ్చిన చోట, నచ్చిన వ్యక్తులతో కలిసి జీవించే హక్కును కలిగి ఉంటారని గతంలో సుప్రీంకోర్టు స్పష్టం చేసిందని ఢిల్లీ హైకోర్టు గుర్తుచేసింది. ఈ తరహా సహజీవన సంబంధాలకు చట్టపరమైన రక్షణ కూడా లభిస్తుందని తెలిపింది. ఉదాహరణకు, 2005 నాటి గృహహింస నిరోధక చట్టం ప్రకారం కూడా ఇలాంటి సంబంధాలలో ఉండే మహిళలకు రక్షణ కల్పించే నిబంధనలు ఉన్నాయని కోర్టు తన తీర్పులో ప్రస్తావించింది. ఎవరైనా కుటుంబ సభ్యులు బెదిరిస్తే నేరుగా పోలీసులను ఆశ్రయించి భద్రత కోరే పూర్తి అర్హత మేజర్లకు ఉంటుంది. మేజర్లు అయిన పిల్లల వ్యక్తిగత జీవితాలను శాసించే హక్కు తల్లిదండ్రులకు లేదని ఈ తీర్పు బలంగా నిరూపిస్తోంది.

జడ్జి పరీక్షలకు ప్రాక్టీస్ ఊరట

మూడేళ్ల ప్రాక్టీస్ నిబంధన రద్దు

- ఒక్క సంవత్సరం ఉంటే చాలు
- సుప్రీంకోర్టు సంచలన తీర్పు
- లా విద్యార్థులకు భారీ శుభవార్త

న్యాయమూర్తి కావాలని కలలు కనే యువ లా గ్రాడ్యుయేట్లకు సుప్రీంకోర్టు ఊరటనిచ్చింది. గతంలో ఉన్న మూడేళ్ల లీగల్ ప్రాక్టీస్ నిబంధనను ఒక సంవత్సరానికి తగ్గిస్తూ శుక్రవారం సంచలన తీర్పు వెలువరించింది. ఈ నిర్ణయంతో న్యాయ విద్య పూర్తి చేసిన వెంటనే సివిల్ జడ్జి పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు పెద్ద ఉపశమనం లభించింది. **- సహనం వందే, న్యూఢిల్లీ**

సుప్రీంకోర్టు ప్రధాన జ్యుడీషియరీ పరీక్షల అర్హతకు సంబంధించి గతంలో ఇచ్చిన మే 2025 నాటి తీర్పును ఇప్పుడు అధికారికంగా సవరించింది. లా గ్రాడ్యుయేట్లు సివిల్ జడ్జి పరీక్షలు రాయాలంటే తప్పనిసరిగా ఉండాల్సిన మూడేళ్ల లీగల్ ప్రాక్టీస్ నిబంధనను కేవలం ఒక్క సంవత్సరానికి కుదించింది. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం... ఈ నిర్ణయాన్ని ఇద్దరు వ్యతిరేకించినా మెజారిటీ తీర్పుగా వెలువరించింది. రివ్యూ పిటిషన్లను విచారించిన కోర్టు ఈ మేరకు యువ న్యాయవాదులకు ఊరటనిచ్చేలా మార్గదర్శకాలను విడుదల చేసింది.

యువతకు పెద్ద ఉపశమనం

లా చదువు పూర్తి చేసిన వెంటనే నేరుగా జ్యుడీషియరీ పరీక్షలకు సిద్ధమయ్యే యువతకు ఈ మార్పు పెద్ద ఉపశమనం కలిగిస్తుందని నిపుణులు భావిస్తున్నారు. అయితే ప్రాక్టీస్ అనుభవం పూర్తిగా లేకుండా నేరుగా న్యాయపీఠంపై కూర్చోవడం సరైనది కాదనే వాదనను కూడా కోర్టు పూర్తిగా కొట్టివేయలేదు. అనుభవం ప్రాముఖ్యతను అలాగే ఉంచుతూనే, ఆ నిబంధన వల్ల యువ న్యాయవాదులపై పడుతున్న ఆర్థిక, మానసిక భారాన్ని తగ్గించడమే ఈ సవరణ ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేసింది.

ఏడాది క్లర్క్‌షిప్ తప్పనిసరి...

ఈ కొత్త ఫ్రేమ్‌వర్క్ ప్రకారం ఎంపికైన అభ్యర్థులు నేరుగా జడ్జిగా బాధ్యతలు చేపట్టడానికి వీలుండదు. వీరు ముందుగా జ్యుడీషియరీ అకాడమీలో ప్రత్యేక శిక్షణ పొందాల్సి ఉంటుంది. అకాడమీ శిక్షణ పూర్తి చేసుకున్న తర్వాత అదనంగా ఒక సంవత్సరం పాటు క్లర్క్‌షిప్ తప్పనిసరి చేశారు. ఈ అదనపు శిక్షణ, క్లర్క్‌షిప్ విధానం వల్ల కొత్త జడ్జిలకు కోర్టు నిర్వహణపై ఆచరణాత్మక జ్ఞానం వస్తుందని సుప్రీంకోర్టు తన తీర్పులో అభిప్రాయపడింది.

తాత్కాలిక మినహాయింపులు...

తాజా తీర్పు ప్రకారం... 2025 మే 25 నుండి 2027 మార్చి 31 మధ్య కాలంలో నోటిఫికేషన్ వచ్చే జ్యుడీషియరీ పరీక్షలకు దరఖాస్తు చేసే అభ్యర్థులకు ఈ ప్రాక్టీస్ నిబంధన వర్తించదు. ఈ మధ్యకాలంలో దరఖాస్తు చేసుకునే ఏ లా గ్రాడ్యుయేట్ అయినా ముందస్తు ప్రాక్టీస్ సర్టిఫికేట్లు ఏవీ చూపించాల్సిన అవసరం లేదు. వీరందరూ ఎలాంటి ఆటంకాలు లేకుండా నేరుగా పరీక్షలకు హాజరు కావడానికి పూర్తి అర్హులుగా పరిగణించబడతారని కోర్టు స్పష్టమైన వెసులుబాటు కల్పించింది. ఇటువంటి అభ్యర్థులు తమ దరఖాస్తుల నిమిత్తం ఇప్పటికే ఒక సంవత్సరం పాటు ప్రాక్టీస్ పూర్తి చేసినట్లుగా పరిగణిస్తామని కోర్టు పేర్కొంది. యువత కోర్టుల చుట్టూ తిరుగుతూ సర్టిఫికేట్ల కోసం పడే ఇబ్బందులను నివారించేందుకే ఈ తాత్కాలిక మినహాయింపులను అమలు చేస్తున్నట్లు న్యాయస్థానం వెల్లడించింది.

ఎంపికైన వారికి శిక్షణ ఎక్కడెక్కడ...?

పరీక్షల్లో విజయం సాధించి ఎంపికైన అభ్యర్థులను మొదట ఒక సంవత్సరం పాటు ట్రైనీ జ్యుడీషియరీ ఆఫీసర్లుగా నియమిస్తారు. ఈ శిక్షణా కాలంలో తొలి ఆరు నెలల పాటు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి లేదా హయ్యర్ జ్యుడీషియరీ సర్వీస్ సభ్యుల పర్యవేక్షణలో లా క్లర్క్‌గా విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. ఆ తర్వాత మిగిలిన ఆరు నెలల పాటు సంబంధిత హైకోర్టు సిట్టింగ్ జడ్జిల ప్రత్యక్ష పర్యవేక్షణలో శిక్షణ పొందాలి. ఈ పద్ధతి ద్వారా న్యాయమూర్తులుగా మారబోయే వారికి కిందిస్థాయి నుంచి పైస్థాయి వరకు అనుభవం గడించే అవకాశం లభిస్తుంది.